సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 11 । జనవరి । 2023



కాఫీని దళారులకు విక్రయించొద్దు IIలో



మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం IIలో



ఉధృతంగా చలిగాలులు
కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతల నమోదు IIలో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతలు చేరిక



టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: వైఎస్సార్ సీపీ పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీలనుంచి చేరికలు అధికమయ్యాయని పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. మొండిగెడ్డ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె సమక్షంలో ఆ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు పూజారి చిట్టిబాబు, చంటిబాబు, జంతరంగి శంకర్రావుతోపాటు 27 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

తాటాకిల్లు దగ్ధం



గర్రంగిలో దగ్ధమవుతున్న తాటాకు ఇల్లు

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత పంచాయతీ, పెద్ద గర్రంగి గ్రామంలో మంగళవారం తాటాకు ఇల్లు అగ్నిప్రమాదంలో దగ్ధం అయ్యింది. ఆస్తి నష్టం దాదాపు రూ. రెండు లక్షలు ఉంటుందని స్థానికులు తెలిపారు. ఇంట్లోని ఎల్ఈడీ టీవీ, ఫర్నిచర్, సంక్రాంతి పండగకు కొనుక్కున్న నూతన వస్త్రాలు, వంట సామగ్రి, ఆహార దినుసులు సమస్తం కాలిపోయాయని ఇంటి యజమాని వెంకటరమణ, భార్య మల్లేశ్వరి విలపించారు. పిల్లలు చలిమంట వేసుకోగా అగ్నికీలలు ఇంటి నడికొప్పును తాకి ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

వివాదాలకు తావులేకుండా భూ రీసర్వే

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర భూ రీసర్వే వివాదాలకు తావు లేకుండా నిర్వహించాలని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో జి. మాడుగుల, చింతపల్లి, జీకే వీధి మండలాల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో సమగ్ర భూ రీసర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే సహాయ సంచాలకుడు వై. మోహన్‌రావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ ఆర్జేడీ జ్యోతికుమారి

కశింకోట: ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని విద్యాశాఖ విశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి ఆదేశించారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో మంగళవారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలతో నాణ్యమైన విద్యా బోధనపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు ట్యాబ్‌ల వినియోగాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించాలని, నోట్, వర్క్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులంటే సరిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా బోధన, ఎంఈవోల పర్యవేక్షణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల విద్యా శాఖ అధికారులు బి.లింగేశ్వరరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• తారుమారు సంత

ఆచారాలకు ప్రతీక

మన్యంలో గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా పండగ సంతలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండగకు ముందు మంగళవారం మండల కేంద్రం జి.మాడుగులలోని వెంకటరాజు ఘాట్ పరిసరాల్లో నిర్వహించిన తారుమారు సంతకు జిల్లా నలుమూలలతో పాటు ఒడిశా నుంచి కుటుంబ సభ్యులతో తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతి పండగకు ఒకరినొకరు ఆహ్వానించుకుని బంధుత్వాలు కుదుర్చుకుని సందడి చేశారు. సుమారు రూ.2 కోట మేర వ్యాపారం జరిగింది.

- కిక్కిరిసిన జి.మాడుగుల
- జిల్లాతో పాటు ఒడిశా నుంచి వచ్చిన గిరిజనులు
- కుటుంబ సమేతంగా తరలివచ్చి సందడి
- సంక్రాంతికి భారీగా కొనుగోళ్లు
- పండగకు ఒకరికొకరు ఆహ్వానం
- జనంతో నిండిపోయిన వెంకటరాజు ఘాట్ ప్రాంగణం



జి.మాడుగులలో తారుమారు సంతకు భారీగా తరలివచ్చిన గిరిజనులు (ఇన్‌సెట్) దోకీతో కల్లు తాగుతున్న గిరిజనుడు

జి.మాడుగుల: మండల కేంద్రంలో ఏటా సంక్రాతి పండగ ముందు తారుమారు సంత నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మత్స్యరాస వంశీయుల పూర్వీకుల నుంచి ఈ సంత నిర్వహిస్తున్నారు. ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల గిరిజనులు కుటుంబసభ్యులతో విచ్చేశారు. పండగకు అవసరమైన నిత్యావసర సామగ్రి, కొత్తదుస్తులు కొనుగోళు చేశారు.పలు జిల్లాల నుంచి వస్త్ర దుకాణాదారులు, నిత్యావసర, వివిధ రకాల వ్యాపారులు వచ్చారు.

భారీగా అటవీ, వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు

ఏజెన్సీకి చెందిన గిరిజన రైతులు రాజ్‌మా చిక్కుళ్లు, పసుపు, అల్లం, పిప్పలి, అడ్డాకులు, కొండచీపుర్లు, నాగలి దుంపలు, కూరగాయలు తదితర అటవీ వ్యవసాయ ఉత్పత్తులను గిరిజనులు సంతకు తీసుకువచ్చి విక్రయించారు. కోళ్లు, మేకలు, గొర్రెలు పశువుల వ్యాపారం భారీగా జరిగింది. గిరిజన తండాల నుంచి పిల్లలు, వృద్ధులతో పాటు కుటుంబ సమేతంగా పండుగ సంతకు తరలి వచ్చారు. గిరిజనులు తీసుకొచ్చిన అటవీ వ్యవసాయోత్పత్తులు వారపు సంతలో విక్రయించారు. వచ్చిన సొమ్ముతో సంక్రాంతికి అవసరమయ్యే నిత్యావసర సరకులు, ఇతరత్ర సామగ్రి, కొత్త దుస్తులు కొనుగోలు చేశారు.



జోరా అంటూ నమస్కరించుకుంటున్న నేస్తాలు (వరుసకు అన్నదమ్ములు)

- దూర ప్రాంతాలనుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు, గిరిజన కుటుంబాలు తమతో తీసుకొచ్చిన యుక్త వయసు పిల్లలను ఒకరికొకరు పరిచయాలు చేసుకొని బంధుత్వాలపై ముచ్చటించారు.
- జీలుగకల్లు, మడ్డికల్లు తదితర మత్తు పానీయాలు కొనుగోలు చేసుకొని ఆయా కుటుంబ సభ్యులందరు ఒక చోట కూర్చొని విందులు (పార్టీలు) చేసుకున్నారు. బంధుత్వాలు కుదుర్చుకున్న గిరిజన ప్రజలు, పీవీటీజీ తెగలు వారు సంక్రాంతి పండుగకు ఒకరినొకరు ఆహ్వానించుకున్నారు.
- ఏడాదికి ఒకమారు జనవరి నెలలో వచ్చే సంక్రాంతి పండగను పురస్కరించుకొని జరిగే సంతకు ప్రజల నుంచి విశేష ఆదరణ ఉంది. సంతకు వచ్చిన నేస్తపు (వరసకు అన్నదమ్ములు) చుట్టాలు తారసపడినప్పుడు మర్యాదపూర్వకంగా వంగి 'జోరా' అంటూ నమస్కరించుకుంటారు. యువకులు ఆలింగనం, కరచలనంతో అప్యాయతగా పలకరించుకొని పండగకు అహ్వానించుకున్నారు.
- ఈ వారపు సంతలకు మాజీ మంత్రులు మత్స్యరాస బాలరాజు, మణికుమారి, వారపుసంత కమిటీ గౌరవ అధ్యక్షుడు మత్స్యరాస వరహాలరాజు, మాజీ ఎంపీపీ వెంకటగంగరాజు, సర్పంచ్ కిముడు రాంబాబు, కమిటీ సభ్యులు ఎం నాగరాజు, గిరి, సాయి, బాబూరావు తారుమారు సంతను పర్యవేక్షించారు.సంతలో గిరిజన యువత సందడి చేశారు.



సంతలో కొత్త దుస్తులు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

కుండలకు భలే గిరాకీ

సంక్రాంతి పండగ సందర్భంగా పిత్రుదేవతలకు **కొత్తకుండలో పు**లగం తయారీ చేసి సమర్పించడం **అనవాయితీ**గా వస్తోంది. ప్రతి ఒక్క **గిరిజన కుటుంబానికి** కొత్త కుండలు అవసరం **ఉండటంతో కుండలు** తయారీ, అమ్మకందారులు **సంతలో కుండ**ల ధరలు విపరీతంగా పెంచారు. **ఒకొక్క** పిడత, కుండలకు రూ.80 **నుంచిరూ.100** ధర పలికింది. అధిక **ధరలు అయ్యిన**ప్పటికీ గిరిజనులు సం**క్రాంతి పండుగ**కు కొత్తకుండ తప్పనిసరి **కావడంతో వా**రికి అవసరమయ్యే కొత్త **కుండలు**(మట్టివి) ఎక్కువగా కొను**గోలు చేశా**రు.



సంక్రాంతి పండగకు అవసరమైన కుండలను కొనుగోలు చేస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, గిరిజన మహిళలు

కిక్కిరిసిన రోడ్లు

పండుగ సంతకు వివిధ ప్రాంతాలకు చెందిన వారు తరలిరావడంతో జి.మాడుగుల నుంచి దేవుని గెడ్డ, నుర్మతి జంక్షన్ రోడ్డు వరకు జనాలతో కిక్కిరిసిపోయాయి. ఏజెన్సీ మారుమూల గిరిజన ప్రాంతాల నుంచి అనేక మంది వచ్చి వేర్వేరుగా బంధుమిత్రులను కలసుకున్నారు. సంతలో రూ.2 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరిగినట్టు అంచనా. సుమారు 20 వేల మంది సంతకు వచ్చినట్టు అంచనా వేశారు. ట్రాఫిక్ సమస్య సమస్య తలెత్తకుండా ఎస్ఐ శ్రీనివాస్ అధ్వర్యంలో పోలీసులు తగిన చర్యలు చేపట్టారు.

ప్రీస్కూల్ నిర్వహణలో అలసత్వం తగదు



గంగవరం ఐసీడీఎస్ కార్యాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి



రాజవొమ్మంగి-2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం రుచి చూస్తున్న పీడీ సూర్యలక్ష్మి

రాజవొమ్మంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశపెట్టిన ప్రీస్కూల్ నిర్వహణ పట్ల అలసత్వం తగదని స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ ఎన్.సూర్యలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె రాజవొమ్మంగి ప్రాజెక్టులోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీస్కూల్ బోధనలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. రాజవొమ్మంగి-2, శివాలయం వీధి అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేసి పిల్లలకు అందజేస్తున్న పౌష్టికాహార పదార్థాలను ఆమె రుచి చూశారు. స్థానిక పీహెచ్‌సీ బర్త్ వెయిటింగ్ రూంలో వైద్యసేవలు పొందుతున్న గర్భిణులను పలకరించారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని వైద్యాధికారులను కోరారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వివిధ పథకాల్లో 436 అంగన్‌వాడీ భవనాలు మంజూరు కాగా వీటిలో 59 పూర్తయినట్లు పీడీ తెలిపారు.సీడీపీవో మణమ్మ, సూపర్‌వైజర్ అరుణలత సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల పిల్లలకు ఆధార్ నమోదు

గంగవరం: గ్రామాల్లో ఐదేళ్ల లోపు పిల్లలందరి ఆధార్ నమోదుకు పక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సీహెచ్ లక్ష్మి అధ్యక్షతన జరిగిన సెక్టార్ సమీక్షా సమావేశంలో ఆమె పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ ప్రక్రియ, గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ, ఆశా, వైద్య సిబ్బంది సమన్వయంతో శిశు మరణాలు సంభవించకుండా చూడాలని, ముఖ్యంగా మహిళలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల బాలికలకు కలిగే ఆరోగ్య నష్టాలపై తల్లిదండ్రులను చైతన్య పరచాలన్నారు. కిశోర బాలికలకు ఆరోగ్యం శారీరక మార్పులపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం గంగవరం ఐసీడీఎస్ కార్యాలయంలో రికార్డులను ఆమె పరిశీలించారు. గంగవరం -1 అంగన్‌వాడీ కేంద్రాన్ని డీడీ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోష్టకాహారం పంపిణీ వివరాలను ఆమె తెలుసుకున్నారు. సీడీపీవో లక్ష్మి, సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల్లో నాణ్యత లోపం



జి.మాడుగుల పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం
- ఈఈ బాలసుందరబాబుకు షోకాజ్ నోటీసు
- జి.మాడుగుల పీహెచ్‌సీ తనిఖీ

జి.మాడుగుల: స్థానిక పీహెచ్‌సీలో నాడు-నేడు పథకంలో చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. భవన మరమ్మతు పనుల్లో నాణ్యత లోపాన్ని గుర్తించిన ఆయన ఈఈ బాలసుందరబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆస్పత్రిలో సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంపై అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో బెడ్‌షీట్లు ఎప్పటికప్పుడు మార్చాలని, పారిశుధ్యం మెరుగుపర్చాలని పీహెచ్‌సీ వైద్యాధికారిని ఆయన ఆదేశించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధులతో అసవరమైన మందులు, బెడ్ షీట్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. గెమ్మెలి, జి.మాడుగుల పీహెచ్‌సీలకు రెండు డెలివరీ టేబుళ్లను ఆయన మంజూరు చేశారు. బర్త్ వెయింటింగ్ హాల్‌కు సంబంధించి ఫుడ్ బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు.

వారపు సంత సందర్శన

జి.మాడుగులలో జరిగిన వారపుసంతను కలెక్టర్ సందర్శించారు. కాఫీ, అల్లం. పసుపు, రాజ్‌మా వ్యాపారులతో చర్చించి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని సూచించారు. కాఫీ లైజన్‌వర్కర్లు, ఉద్యానవన వ్యవసాయ సహాయకులు, సబ్‌అసిస్టెంట్లు బృందంగా ఏర్పడి గిరిజన రైతులకు ధరలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. పసుపులంక, గొడుగుమామిడి, తోకగరువు గ్రామాల రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కాఫీ పల్పింగ్ యూనిట్ మంజూరు చేయాలని సొలభం పంచాయతీ రీమెలి గ్రామ రైతులు కోరారు. యూనిట్ అంచనాలో 50 శాతం భరిస్తే మిగతా నిధులను ప్రభుత్వం సమకూరుస్తుందని ఆయన తెలిపారు.కాఫీ ఏడీ అశోక్, జీసీసీ డీఎం పార్వతమ్మ, ఎంపీడీవో లోహిత్‌జయసాగర్ పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకుంటే చర్యలు

డ్వామా పీడీ రమేష్‌రామన్

రాజవొమ్మంగి: ఉపాధి హామీ సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ రమేష్‌రామన్ హెచ్చరించారు. మండలంలో 2020-21, 2021-22లో జరిగిన ఉపాధిపనులపై గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. రెండేళ్లలో మండలంలోని 19 పంచాయతీల్లో రూ. 27,32,54,528ల విలువైన పనులు జరిగాయని పీడీ తెలిపారు. ఈ పనులకు సంభందించి రూ.53,36,652 మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్టు చెప్పారు. ఇందులో తక్షణం రూ.71,681 సంబంధిత ఏపీవో, కంప్యూటర్ ఆపరేటర్ల నుంచి రికవరీ చేయాలని ఆదేశించాని చెప్పారు. అలాగే రూ.43,77,926 మేర జరిగిన అవకతవకలకు సంబంధించి వారంలోగా సరిదిద్దుకోపోతే ఆ సొమ్మును కూడా గతంలో ఇక్కడ పనిచేసిన ఏపీవోలు, కంప్యూటర్ ఆపరేటర్ నుంచి రికవరీ చేస్తామని సూచించారు. ఎవెన్యూప్లాంటేషన్ పనులకు ఎవిడెన్స్ చూపకపోతే సంభందిత సిబ్బంది నుంచి మరో రూ. 71,684 మేర రికవరీ చేసేందుకు రంగం సిద్ధమైందన్నారు.

రికార్డులు అప్పగించకపోవడంపై ఆగ్రహం

ప్రజావేదిక జరుగుతుందని తెలిసినప్పటికీ సెర్ప్, గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్, పశుసంవర్ధక తదితర శాఖలకు రూ.లక్షల్లో జరిగిన పనులకు సంభందించి అధికారులు రికార్డులను అప్పగించకపోవడంపై డ్వామా పీడీ రమేష్ రామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఇప్పటికే బడదనాంపల్లి పంచాయతీ ఎఫ్ఏపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్టు పీడీ తెలిపారు. అనంతరం అడ్డతీగల, రాజవొమ్మంగి, వై. రామవరం మండలాలకు చెందిన ఎఫ్ఏలు, టీఏలకు జరిగిన శిక్షణాకార్యక్రమంలో పీడీ పాల్గొన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి సీహెచ్. నిర్మలాదేవి, ఏపీడీ భాగ్యారావు, ఎంపీడీవో బాపన్నదొర, సీఆర్పీ డీ.రాజేంద్రప్రసాద్, డీఆర్పీలు చెన్నకృష్ణయ్య, ప్రసాద్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీపీ గోము వెంకట లక్ష్మి, జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు.



ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ రమేష్‌రామన్

భాషా వలంటీర్ల కొనసాగింపు హర్షణీయం

అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



కొయ్యూరు: రెండేళ్లుగా నిలిచిపోయిన భాషా వలంటీర్ల నియామకానికి ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని అరకు ఎంపీ మాధవి పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇవ్వాల్సిన నిధులపై లోక్‌సభ స్పీకర్ ద్వారా గిరిజన సంక్షేమ మంత్రి అర్జున్ ముండా దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లామని వివరించారు. విధుల్లోకి చేరాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో పాత వారంతా తిరిగి విధుల్లోకి చేరుతారని తెలిపారు. ఏటా రూ.నాలుగు కోట్ల వరకు మాతృ భాషా వలంటీర్లకు నిధులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మన్యంలో వివిధ రకాల భాషలు మాట్లాడేవారు ఉన్నందున వారికి తెలుగులో బోధన చేస్తే అర్థం కావడం లేదన్నారు. దీనిలో బాగంగా కువి భాష తెలిసిన వారిని వలంటీర్లుగా ఏర్పాటు చేసుకుని వారి ద్వారా తెలుగును బోధన చేస్తున్నారని తెలిపారు.

అసత్య ప్రచారం తగదు

- ఐటీడీఏ ప్రోత్సాహంతో కాఫీకి మంచి ధర
- కాఫీ రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు సెగ్గె కొండలరావు

చింతపల్లి రూరల్: మన్యంలో గిరిజన రైతులు పండిస్తున్న కాఫీకి మంచి ధరలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే కొందరు మోసాలు జరుగుతున్నాయని అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాఫీ రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు సెగ్గె కొండలరావు అన్నారు. మంగళవారం సంఘం నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులు కాఫీ సాగు చేసేందుకు ఐటీడీఏ అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. కానీ తాము పండించిన పంటకు గిట్టుబాటు ధరలు రావడం లేదని, దళారులకు తక్కువ ధరలకు విక్రయించుకుని నష్టపోయేవారమన్నారు. దీంతో ప్రభుత్వం కాఫీకి మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంతో నాణ్యమైన కాఫీని తయారు చేసేందుకు ఎకో పల్పింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రైతుల వద్ద వారి ఇంటికే వెళ్లి పండ్లు కొనుగోలు చేసి వెంటనే వారి ఖాతాల్లోకి సొమ్ము జమ చేయడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్నారు. తరువాత అదనపు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. దీంతో దళారీ వ్యవస్థ నిర్వీర్యమవుతుందనే కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల కాఫీ రైతులు మంచి లాభాలు పొందుతున్నారని ఆయన అన్నారు. అన్ని మండలాల రైతులకు మేలు జరుగుతుందన్నారు. తప్పుడు ప్రచారాలు విరమించకుంటే కాఫీ రైతులే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి గాం సింహాచలం, దామణాపల్లి సర్పంచ్ కుందెరి రామకృష్ణ, రైతు సంఘం సభ్యుడు మామిడి గోవిందరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండలరావు

ముందస్తు సంక్రాంతికి శ్రీకారం



బందపాలంలో థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు

- మూడు గ్రామాల్లో భోగీ సందడి
- ముందుగానే పండగ నిర్వహణ

సాక్షి,పాడేరు: మండలంలోని మూడు గ్రామాల్లో గిరిజనులు ముందస్తుగానే సంక్రాంతి సంబరాలకు మంగళవారం నుంచి శ్రీకారం చుట్టారు. మినుములూరు పంచాయతీ బందపాలంలో సోమవారం అర్ధరాత్రి గిరిజనులు భోగిమంటతో సందడి చేశారు. మంగళవారం ఉదయం నుంచి గ్రామంలో సంక్రాంతి సందడి నెలకొంది. మధ్యాహ్నం గ్రామచావిడిలో గిరిజన మహిళలు థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. వనుగుపల్లి పంచాయతీలోని వనుగుపల్లి, బిరిమిశాల గ్రామాల్లో మంగళవారం ఉదయం గంగతల్లి పండగను గిరిజనులు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. సాయంత్రం శంకుదేవుడికి ప్రత్యేక పూజలు అనంతరం ఈ రెండు గ్రామాలలోను రాత్రి 8గంటల సమయంలో భోగి మంటలు వేయడంతో పండగ సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో మూడు రోజుల ముందు సంక్రాంతి సంబరాల నిర్వహణ ఆనవాయితీగా వస్తోంది. భోగి పండగను భక్తిశ్రద్ధలతో ప్రారంభించిన గిరిజనులు బుధ, శుక్ర శనివారాల్లో సంక్రాంతి పండగ జరుపుకుంటామని తెలిపారు.



బందపాలంలో భోగి మంట

క్లుప్తంగా

పాఠశాల ఆకస్మిక తనిఖీ



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ప్రత్యేకాధికారి సలీమ్ బాషా

మారేడుమిల్లి: పీఎంసీ పాఠశాలగా గుర్తింపు పొందిన స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాలను రాష్ట్ర విద్యా శాఖ సమగ్ర శిక్ష అభియాన్ ప్రత్యేక అధికారి, పీఎంసీ పాఠశాలల రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ షేక్ సలీమ్ బాషా మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతి గృహాల్లో సౌకర్యాలు పరిశీలించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ షేక్ అలీషా, సీఆర్‌పీలు పి.రాజారెడ్డి, డి.కమలాకర్ బాబు, ఉపాధ్యాయులున్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

చింతూరు: జవహర్ నవోదయలోని ఆరో తరగతిలో 2023–24లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, 2011 మే నుంచి 2013 ఏప్రిల్ మధ్య పుట్టిన వారై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31 వరకు గడువుందని, ఏప్రిల్ 4న రాతపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, జవహర్ నవోదయ సర్టిఫికెట్, విద్యార్థి సంతకం, ఆధార్ నంబరు, ఫోన్ నంబరు కలిగి ఉండాలని తెలిపారు. ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు తమ పరిధిలోని విద్యార్థులంతా జవహర నవోదయ ఆరో తరగతిలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పీవో ఆదేశించారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

- నేచరల్ ఫార్మింగ్‌పై శిక్షణ
- రైతులకు కేవీకే శాస్త్రవేత్తల సూచనలు



సీతారంకాలనీలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్త చిరంజీవి



ఐ.పోలవరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రంపచోడవరం: సేంద్రియ పద్ధతులతో కూరగాయలు సాగుతో అధిక పోషకాలతో పాటు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్. ఎన్ చిరంజీవి అన్నారు. ప్రకృతి వ్యవసాయం, కూరగాయల తోటల్లో సేంద్రియ పద్ధతులపై ఐ.పోలవరం గ్రామంలో 30 మంది జెడ్‌బీఎన్ఎఫ్(జీరో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్) స్టాఫ్‌కు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకె శాస్త్రవేత్తలు టి.క్రాంతికుమార్ (ఉద్యాన శాఖ) డాక్టర్.ప్రవీణ్‌బాబు (విస్తరణ విభాగం) పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ట్రైకో డెర్మాతో విత్తన శుద్ధి, నారుశుద్ధి పద్ధతులను వివరించారు. ట్రైకోడెర్మా, వేపపిండిని చివికిన పేడలో కలిపి వృద్ధి చేసే విధానాన్ని తెలియజేశారు. అలాగే కూరగాయాల తోటల్లో పురుగులు, తెగుళ్ల నివారణకు పరాన్న జీవులు, జీవ శిలీంధ్ర నాశనులు, కషాయం వాడకాన్ని వివరించారు. రైజోబియం, అజటి బాక్టర్, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

దేవీపట్నం మండలం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన సితార, గుబ్బలపాలెం కాలనీల్లో ప్రకృతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని కేవీకె శాస్త్రవేత్త ఎస్.చిరంజీవి పరిశీలించారు. సుమారు 30 మందికి పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పుట్టగొడుగుల పెంపకం యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ప్లాస్టిక్ బ్యాగుల్లో మైశిలియం నింపిన తరువాత వాటిలో మట్టిని నింపే విధానాన్ని వివరించారు. 15 రోజుల్లో పుట్టగొడుగులు వస్తాయని తెలిపారు. స్వయం ఉపాధిగా పుట్టగొడుగుల పెంపకంతో ఆర్థికంగా బలోపేతం కావచ్చన్నారు. ఈ మేరకు కృషి విజ్ఞాన కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, తదితరులు

అనంతగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మారుమూల జీనబాడు పంచాయతీ కేంద్రంలోని రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ మాధవి, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య పాలనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేసి, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు గిరిజనులకు వరంగా భావిస్తున్నారన్నారు. గతంలో కులధ్రువీకరణ, నివాస పత్రాలతో ఇతర పనులకు సంబంధించి మైళ్లదూరం ప్రయాణం చేసి, మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం ద్వారా ప్రభుత్వ సేవలన్నీ అందుతున్నాయని, దీనికి గిరిజనులంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నారని కొనియాడారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి చేపడుతూ సుపరిపాలన అందిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర స్వామి, ఎంపీటీసీ సభ్యులు రామలక్ష్మి, శ్రావణి, పార్టీ కన్వీనర్ భీమరాజు, రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూర్యానారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, మాజీ సర్పంచ్ స్వామి, నాయకుడు నాగేశ్వరరావు, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఈవోపీఆర్డీ మల్లేశ్వరరావు, కార్యదర్శి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అధునాతన యంత్రం

- కాఫీ పల్పింగ్ కేంద్రంలో ఆధునిక డ్రైయర్
- గంటకు నాలుగు టన్నుల రీ డ్రై
- 10 గంటల్లో విక్రయానికి సిద్ధం



పల్పింగ్ యూనిట్‌లో ఏర్పాటు చేసిన డ్రైయర్ యంత్రం

చింతపల్లి: మండల కేంద్రంలోని ఏకో పల్పింగ్ యూనిట్‌లో అధునాతన రోటరీ డ్రైయర్ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. రూ.44 లక్షలతో సమకూర్చిన ఈ యంత్రం గంటకు 4 టన్నుల పర్చిమెంట్‌ను 10 గంటల్లో పూర్తిగా డ్రైచేసి విక్రయానికి సిద్ధం చేయగలదు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో 2020లో రూ.4కోట్లతో ఏకో పల్పింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. గిరిజన రైతులు పండించిన కాఫీ నాణ్యతగా తయారు చేసి అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించడం ద్వారా మంచి ధరలు పొందవచ్చన్నది యూనిట్ లక్ష్యం.గిరిజన కాఫీ రైతులతో సంఘాన్ని ఏర్పాటు చేసి రైతుల వద్ద ముందుగా పండ్లను కొనుగోలు చేసి నిర్ణయించిన ధరలను చెల్లిస్తోంది. పల్పింగ్ చేసి విక్రయించిన మ్యాక్స్ ద్వారా విక్రయించిన తరువాత వచ్చిన సొమ్ములో బోనస్‌గా మరికొంత చెల్లిస్తోంది. పల్పింగ్ చేసిన పార్చిమెంట్‌ను పూర్తిగా ఎండబెట్టేందుకు.15 రోజుల వరకు పడుతుంది. దీంతో కూలీల ఖర్చు ఎక్కువ అవుతుంది. అలా కాకుండా రీడ్రయర్‌లో కేవలం 10 గంటల్లో 4 టన్నుల పార్చిమెంట్ సిద్ధం చేయగలదు. బెంగుళూరు నుంచి ఈ యంత్రాన్ని ఐటీడీఏ అధికారులు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చారు.

రైతులకు నేరుగా సేవలు

ఏకో పల్పింగ్ యూనిట్‌లో రైతులకు సేవలు పొందవచ్చు. మ్యాక్స్‌కు కాఫీ పండ్లు విక్రయించకపోయినా రైతులు నేరుగా కిలో పండ్లకు రూ.2 చెల్లించి పల్పింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు 9 వేల టన్నుల పండ్లను రైతులు పల్పింగ్ చేయించుకున్నట్టు యూనిట్ అకౌంటెంట్ సత్యనారాయణ తెలిపారు.

కాఫీని దళారులకు విక్రయించొద్దు

కలెక్టర్ సుమిత్ కుమార్



కాఫీ కొనుగోళ్లపై సంస్థ సీఈవో గంగరాజును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

జి.మాడుగుల: దళారును నమ్మి మోసపోకుండా గిరిజన రైతులు కాఫీని గిట్టుబాటు ధరకు విక్రయించి ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మండలంలోని ఎం.నిట్టాపుట్టు గ్రామంలో గిరిజన రైతు సేవా, ఉత్పత్తిదారుల మ్యాక్స్ సొసైటీ లిమిటెడ్, కోవెల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన ఎకో పల్పింగ్, ఎకో సోలార్ డ్రైయింగ్ యూనిట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గిరి రైతుల నుంచి కాఫీ కొనుగోళ్లు, తేమ శాతం తదితర వివరాలను గిరిజన రైతు సేవా, ఉత్పత్తిదారుల మ్యాక్స్ సొసైటీ లిమిటెడ్ సీఈవో పరదాని గంగరాజు నుంచి తెలుసుకున్నారు. గిరి రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధరలను అనుసరించి గిట్టుబాటుధర కల్పిస్తూ వారి నుంచి కాఫీ కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. జీసీసీ డీఎం పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా చలిగాలులు



చలిమంటలు కాగుతున్న గిరిజనులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.చలిగాలుల తీవ్రత నెలకొనడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి చలితీవ్రతతో జిల్లాలోని ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం నుంచి చలిగాలులు విజృంభిస్తున్నాయి. అర్ధరాత్రి సమయంలో చలిపులితో ప్రజలు నరకయాతన పడుతున్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండు డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 7 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదైనట్టు అధికారులు తెలిపారు. పొగమంచు ఉదయం 8గంటల వరకు కురిసింది. సూర్యోదయం వేగంగా అయినప్పటికీ చలి తీవ్రత తగ్గలేదు. మరో మూడు రోజుల వరకు చలిగాలుల తీవ్రత ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.

భూ రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

మారేడుమిల్లి: భూముల రీ సర్వే ప్రక్రియ త్వరగతిని పూర్తి చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో శ్రీనివాసరావు, వీఆర్వోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ మండలంలోని గిరిజన భూములకు సంబంధించి రీసర్వే వేగవంతం చేసి నూరుశాతం పూర్తి చేయాలని వీఆర్వోలకు ఆదేశించారు.మ్యూటేషన్ గుర్తించిన వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పలు అంశాలపై అయన రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. అనంతరం గ్రామంలో వివాదస్పద భూములను పరిశీలించారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

- వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్
- సిబ్బంది సమష్టిగా పనిచేయాలని ఆదేశం

పాడేరు రూరల్: మన్యంలో మాతా శిశు మరణాల నివారణకు వైద్యారోగ్య శాఖ సిబ్బంది సమష్టిగా పని చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పాడేరు డివిజనలో ముంచంగిపుట్టు, పాడేరు, అరకు క్లస్టర్ల పరిధిలోని పీహెచ్‌సీల ఏఎన్ఎంలు, వైద్యసిబ్బందితో ఆయన సమీక్షించారు. మాతా, శిశువులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. మూడు నెలల గర్భిణిగా నిర్ధారించిన తక్షణమే సంబందిత వైద్య సిబ్బంది ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసి తొమ్మిది నెలలు నిండేంతవరకు అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. తల్లీబిడ్డకు అందిస్తున్న వైద్య చికిత్సలు, వ్యాక్సినేషన్ తదితర వివరాలను ఎంసీహెచ్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేసి మాతా, శిశు మరణాలకు కారణమైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డెమోగ్రఫీ శివ శంకర్‌బాబు పాల్గొన్నారు.

గంజాయి సాగు జోలికి పోవద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్

చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్

గూడెంకొత్తవీధి: గిరిజనులు గంజాయి సాగుకు దూరంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్ సూచించారు.మంగళవారం ఆయన మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన జర్రెల పంచాయతీలోని మారుమూల గ్రామాల్లో పర్యటించారు.ఒకప్పుడు గంజాయికి ప్రధాన స్థావరాలుగా ఉన్న ఈ ప్రాంతాల్లో గిరిజనులు గంజాయి సాగుకు దూరంగా ఉండటాన్ని ఏఎస్పీ అభినందించారు. గిరిజన యువత చదువుకుని ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని కోరారు. గిరిజనులకు ఏ అవసరం వచ్చినా తాము, పోలీసు శాఖ పరిష్కరించేందుకు ముందుంటామనినారు. ఆధార్, రేషన్ కార్డుల సమస్యలు పరిష్కరించాని గిరిజనులు ఏఎస్పీని కోరారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఐను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సీఐ రమేష్, గూడెంకొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

అడ్డతీగల శివారున రెండు బైక్‌లు ఢీ



తీవ్రగాయాలైన రామన్నదొర



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాట్ల శ్రీనివాసరెడ్డి

అడ్డతీగల: అడ్డతీగల శివారున రైస్ మిల్లు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి పరస్పరం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు.రంపచోడవరఉద్యానశాఖ నర్సరీలో పనిచేస్తున్న బి.రామన్నదొర అడ్డతీగల వస్తుండగా అడ్డతీగల నుంచి గంగవరం వైపు వెళ్తున్న గంగవరం మండలం ఏటిపల్లికి చెందిన యాట్ల శ్రీనివాసరెడ్డి ఇద్దరు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి.దీంతో రామన్నదొరకు కుడి కన్నుపై ఇతర శరీర భాగాల వద్ద బలమైన గాయాలయ్యాయి. అలాగే యాట్ల శ్రీనివాసరెడ్డికి కూడా ముఖం ఇతర శరీర భాగాలపై గాయాలయ్యాయి. రక్త మోడుతున్న ఇద్దరినీ 108 వాహనంలో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్రాంతి స్పెషల్స్ రెడీ!

- 550 బస్సులను నడపనున్న ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి మొదలైన సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ చార్జీలే
- అడ్వాన్స్ టిక్కెట్ రిజర్వేషన్లకు డిమాండ్



సాక్షి, విశాఖపట్నం: సంక్రాంతి పండగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది. ఈ పండగకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే, వెళ్లే వారి కోసం విశాఖ నుంచి 550 స్పెషల్ బస్సులను నడపనుంది. సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి రోజుకు ఐదు రెగ్యులర్ బస్సులు నడుస్తున్నాయి. వీటిలో రోజుకు 177 చొప్పున ఉన్న సీట్లు ఈనెల 13వ తేదీ వరకు నూరు శాతం భర్తీ అయ్యాయి. సోమవారం విశాఖపట్నం నుంచి కొన్ని స్పెషల్ బస్సులను హైదరాబాద్ పంపారు. మంగళవారం అక్కడ నుంచి ఇవి బయలుదేరాయి. హైదరాబాద్ నుంచి 14వ తేదీ వరకు 35 స్పెషల్ బస్సులను అందుబాటులో ఉంచింది. వీటిలో 90 శాతానికి పైగా సీట్లు ఇప్పటికే అడ్వాన్సు రిజర్వేషను చేయించుకున్నారు. మరో వైపు తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్లే వారి కోసం ఈనెల 15, 16, 17 తేదీల్లో రోజుకు నాలుగు చొప్పున ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచారు. వీటిలో సీట్ల కోసం అడ్వాన్సు రిజర్వేషన్లు జరుగుతున్నాయి. ఇవికాకుండా రెగ్యులర్‌గా రోజుకు ఐదు బస్సులు ఇక్కడ నుంచి నడుస్తున్నాయి. వీటిలో చాలావరకు సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి.

ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి..

హైదరాబాద్‌తో పాటు విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, అమలాపురం, భీమవరం, పార్వతీపురం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట తదితర ప్రాంతాలకు నడపడానికి ఆర్టీసీ అధికారులు అవసరమైన బస్సులను సిద్ధం చేశారు. రెగ్యులర్ బస్సులకు మించి ప్రయాణికులుంటే ప్రత్యేక బస్సులు నడుపుతారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి బుధవారం నుంచే వీటిని నడపడానికి చర్యలు తీసుకున్నామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) అప్పలరాజు 'సాక్షి'తో చెప్పారు. ఈసారి స్పెషల్ బస్సుల్లో మునుపటిలా టిక్కెట్లుపై 50 శాతం అదనపు చార్జీ వసూలు చేయడం లేదని, ఇది ప్రయాణికులకు ఊరటనిచ్చే అంశమని తెలిపారు.

గత సంక్రాంతి కంటే ఎక్కువ స్పెషల్స్

గత సంక్రాంతికి అప్పటి విశాఖ రీజియన్ నుంచి 492 ప్రత్యేక బస్సులను నడిపారు. అప్పటికి కోవిడ్ మూడో వేవ్ పూర్తిగా తొలగకపోవడంతో ప్రయాణికుల తాకిడి తగ్గింది. ప్రస్తుతం కోవిడ్ ఛాయలు లేకపోవడంతో మళ్లీ సాధారణ పరిస్థితికి వచ్చింది. దీంతో గత సంక్రాంతి కంటే ఈసారి ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ఏడాదికన్నా 68 స్పెషల్స్‌ను పెంచారు.

పాఠశాలలో సంక్రాంతి సందడి



ఆకట్టుకున్న ముగ్గులు



భోగిమంట వద్ద విద్యార్థుల సందడి

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని భోగి మంట వేశారు. విద్యార్థులకు ముగ్గులు, ఆటల, గేయ, నృత్య పోటీలు నిర్వహించారు. పిండి వంటలతో భోజనాలు పెట్టారు. పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలియజేశారు.సంక్రాంతి వేడుకలతో పాఠశాలలో పండుగ వాతావరణం ముందుగానే కనిపించింది.



వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు

పన్నుల వసూలు వేగవంతం



మాట్లాడుతున్న డీపీవో కొండలరావు, డీఎల్‌పీవో వివేక్

రంపచోడవరం: పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచడం ద్వారా గ్రామాలను అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. స్థానిక పీఎంఆర్‌సీలో మంగళవారం రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల విస్తరణ అధికారులు (పీఆర్అండ్ ఆర్‌డీ), పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీవో ఎస్.వివేక్‌తో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో కొండలరావు మాట్లాడుతూ జనవరి నెలాఖరుకు 75 శాతం ఇంటి పన్నులు వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ఏజెన్సీలో రిసార్ట్స్, అతిథి గృహాలకు సంబంధించి పన్నులతో పాటు లైసెన్స్ ఫీజులు నిర్దేశించాలని ఆదేశించారు. క్లాప్ మిత్ర వేతనాలు, కరెంటు చార్జీలు చెల్లింపులు, బడ్జెట్, చెత్త నుంచి సంపద షెడ్ల నిర్వహణ, స్పందన ఫిర్యాదులు, కోర్టు కేసులపై సమీక్షించారు.